క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి తరలివెళ్లిన నేతలు



విజయనగరం బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: జిల్లా కేంద్రంలోని జగన్నాథ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశానికి మండల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున ఆధ్వర్యంలో ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

రక్షిత మంచినీటి ట్యాంక్‌ల పరిశీలన



జాకేరులో ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, తదితరులు

వేపాడ: మండలంలోని పలు రక్షిత మంచి నీటి ట్యాంక్‌లను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి, మండల కో ఆర్డినేటర్ రాంబాబు, తదితరులు పరిశీలించారు. జాకేరు, కరకవలస, గుడివాడ గ్రామాల్లో గురువారం పర్యటించి మంచినీటి ట్యాంక్‌లను పరిశీలించి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. వారానోకోసారి ట్యాంక్‌ను శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించండి



ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో పాల్గొన్న ఏపీఓ కృష్ణవేణి

గజపతినగరం: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం సాగు చేస్తున్న రైతన్నలంతా ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని ఏపీఓ కృష్ణవేణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యానవన పంటలకు శ్రేష్ఠమైన, అనుకూలమైన భూములను గుర్తించి రైతులతో సాగు చేయించాలని సూచించారు. మామిడి, సపోట, జీడిమామిడి, జామి, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ పామ్, తదితర పంటలను సాగు చేసేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు. అదేవిధంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఫారంపాండ్స్ తీయించాలని సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ రాజారావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను జిందాల్ నిర్వాసితులు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలిసి తమ గోడు వెళ్లబోసుకుని, వినతిపత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వర్ణాంధ్ర – 2047 సమావేశానికి హాజరైన మంత్రిని ఎమ్మెల్సీ రఘురాజు ఆధ్వర్యంలో నిర్వాసితులు కలిశారు. జిందాల్ నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకోవాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధిహామీ పథకం అధికారులు

కొత్తవలస: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ఐఈసీపై (ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్‌పర్సన్ (ఎస్ఆర్‌పీ) ఎం.గోవిందరావు మాట్లాడుతూ.. ఎంపిక చేయబడిన పనులు, వేతనాలు, తదితర అంశాలపై వివరించారు. ఏపీఓ జనార్దనరావు మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకాన్ని మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ఎ.నరేష్, వై.శ్రీను, ఆర్.రమేష్, సర్పంచ్ ఎస్.మంగమ్మ, పలువురు ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ఆక్రమణ చెరలో.. దేవాలయాల భూములు

- ఆస్తులున్నా.. ఆదాయం సున్నా.
- ఆలయాల్లో ధూపదీపాలు కరువు
- 53 దేవాలయాలకు 1186 ఎకరాలు
- ఆక్రమణదారుల చెరలో 535 ఎకరాలు
- లీజుల్లేకుండా అనుభవిస్తునది 516 ఎకరాలు



వందల ఎకరాల భూములున్నా నైవేద్యానికి నోచుకోని ధర్మవరం కేశవస్వామి ఆలయం

శృంగవరపుకోట: 'రాజ్యం వీర భోజ్యం' అన్నది పూర్వం రాజుల కాలంలో మాట. రాజ్యాలు, రాజులు లేకున్నా ఊరి పేరులోనే 'కోట' ఉండడంతో ఇంకా ఇక్కడి పెత్తందారులకు ఆ వాసనలు మాత్రం వదల్లేదు. అందుకే దేవుడి భూముల్ని చెరపట్టి.. చెల్లించాల్సిన శిస్తులు ఎగ్గొట్టి.. దేవదాయశాఖ భూములను సొంతానికి వినియోగించుకుంటూ తమకు ఎదురులేదనే భావనలో ఉన్నారు. వీరి దాష్టీకంతో దేవదేవుళ్లు ధూప, దీపాలకు నోచుకోలేకపోతున్నారు. రాజకీయ నాయకులు, పెద్దల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన అధికారులు పెత్తందారులను ఎదురించే సాహసం చేయలేకపోతున్నారు. ఆ గ్రామాల్లో వాళ్లని కాదని భూముల లీజులకు వేలం పాటలు నిర్వహించలేక చేతులు ముడుచుకుని గమ్మున ఉంటున్నారు.

53 దేవాలయాలకు..

నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాలతో పాటు గంట్యాడ మండలం కూడా ఎస్.కోట ఎండోమెంట్ డివిజన్ పరిధిలో ఉంది. జామి మండలంలో మూడు దేవాలయాలకు 17.85 ఎకరాలు.. లక్కవరపుకోటలో 14 దేవాలయాలకు 507.27 ఎకరాలులు.. ఎస్.కోటలో 12 దేవాలయాలకు 225.5 ఎకరాలు.. వేపాడలో 11 దేవాలయాలకు 131.2 ఎకరాలు.. కొత్తవలసలో 4 దేవాలయాలకు 237.98 ఎకరాలు.. గంట్యాడ మండలంలో 10 దేవాలయాలకు 66.75 ఎకరాల భూములున్నాయి. మొత్తంగా ఎస్.కోట డివిజన్ పరిధిలోని 53 దేవాలయాలకు 1186.45 ఎకరాల భూములున్నాయి.

ఆక్రమణ చెరలో..

గత కొన్నేళ్లుగా భూబకాసురులు 535.36 ఎకరాల దేముడు భూముల్ని చెరపట్టారు. దేవదాయ, రెవెన్యూ శాఖల నిర్లక్ష్యం, ఉదాసీనత వైఖరి వల్ల దశాబ్దాల కిందట కొందరు ఈ భూములను పూర్తిగా కబ్జా చేశారు. కొంతమంది ఆక్రమణదారులు మరో అడుగు ముందుకేసి రెవెన్యూ రికార్డుల్లో మార్పులు కూడా చేసేశారు. మరికొంతమంది దేవదాయ శాఖ భూములను తనఖా పెట్టడం, విక్రయించడం కూడా చేసేశారు. ఇదంతా తెలిసినా ఏ ప్రభుత్వం కూడా చర్యలు తీసుకునేందుకు ముందుకు రాకపోవడం విచారకరం. డివిజన్ వ్యాప్తంగా కేవలం 127.44 ఎకరాలకు మాత్రమే లీజులు వసూళ్లు చేస్తున్నారు.

శిస్తులు ఇవ్వకుండానే..

ఎస్.కోటలో 96 ఎకరాలు.. లక్కవరపుకోటలో 218.35 ఎకరాలు.. వేపాడలో 63.02 ఎకరాలు.. కొత్తవలసలో 132.82 ఎకరాలు.. గంట్యాడలో ఆరున్నర ఎకరాలకు సంబంధించి ఎటువంటి వేలంపాటలు నిర్వహించకుండానే కొంతమంది ఆక్రమణదారులు అనుభవిస్తున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే భూములున్నా వాటిపై ఆదాయాన్ని తీసుకోలేక దేవదాయశాఖ చతకిలబడుతోంది. భూముల విషయమై జిల్లా కోర్టు నుంచి హైకోర్టు వరకూ పలు కేసులు కూడా నడుస్తున్నాయి. ఇప్పటికీ కొన్ని భూములు దేవదాయశాఖ సిబ్బందికి తెలియక కనీసం పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోలేని దుస్థితిలో ఉన్నారు.

ధూపదీపాలకు కరువే..

పూర్వం పాలకులు, జమీందారులు భవిష్యత్‌లో దేవాలయాల పోషణ భారం కాకూడదన్న ఉద్దేశంతో దేవాలయాలకు భూములు కేటాయించారు. కాగా ఇప్పటి బకాసురుల ఆకలికి ఆలయాల ఆస్తులు కరిగిపోయాయి. వందల ఎకరాలున్న దేవాలయాలు కనీసం ధూప, దీప, నైవేద్యాలకు నోచుకోవడం లేదు. 127 ఎకరాలున్న ఎస్.కోట మండలం ధర్మవరంలో కేశవస్వామిధాలయం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఏడాదికో మారు గ్రామస్తులు చందాలు వేసుకుని గుడిలో పూజలు జరిపిస్తున్నారు.



కేశవస్వామి దేవస్థానానికి చెందిన భూములు

చర్యలు తీసుకుంటాం..

డివిజన్ పరిధిలోని చాలా దేవాలయాలకు ఆస్తులున్న మాట వాస్తవమే. కొన్ని భూములకు సంబంధించి కోర్టుల్లో కేసులున్నాయి. కొన్ని భూములకు సరైన రికార్డులు లేవు. ఆక్రమణదారులకు సెక్షన్ 83 నోటీసులు ఇచ్చి భూములు స్వాధీనం చేసుకుంటాం. పోలీస్, రెవెన్యూ శాఖల సహకారం తీసుకుని గ్రామాల్లో బహిరంగ వేలం పాటలు నిర్వహించి శిస్తులు పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం.

– ఎం.ప్రసాదరావు, ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్, ఎస్.కోట డివిజన్

మాజీ సీఎంను కలిసిన యువనేతలు



వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని విజయనగరం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, శృంగవరపుకోట నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు వాకాడ సతీష్ తాడేపల్లిలో జగన్ మోహన్‌రెడ్డిని గురువారం వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా అవినాష్, సతీష్ సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ.. అధినేత అందించిన స్ఫూర్తితో యువజన విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు.

– శృంగవరపుకోట

మళ్లీ అదే తంతు..

- పరిష్కారం కాని మురుగునీరు తరలింపు సమస్య



మురుగునీటి సమస్యపై చర్చిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ, ఈఓ

శృంగవరపుకోట: మురుగునీరు తరలించే విషయంలో అధికారులు హడావిడి చేశారే తప్ప పరిష్కరించలేకపోయారు. పంచాయతీ ఈఓ అనురాధ గురువారం సంఘటనా స్థలానికి చేరుకుని మురుగునీరు తరలిస్తామని హడావిడి చేసి ఫైనల్‌గా ఏమీ చేయకుండా వెళ్లిపోయారు. ఎస్.కోట – విశాఖ ప్రధాన రహదారిలో పది రోజులుగా మురుగునీరు నిల్వ ఉంది. ఈ మురుగునీటిని తరలించాలనే ఉద్దేశంతో ఈఓ అనురాధ జేసీబీతో సహా చేరుకున్నారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానం వద్ద నిల్వ ఉన్న మురుగు నీటి తొలగిస్తే రోడ్డు మీదున్న మురుగునీరు పోతుందనే ఉద్దేశంతో కళాశాల మైదానానికి ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట కాలువ తీసేందుకు సిద్ధపడ్డారు. దీంతో దుకాణాల యజమానులు జిరాయితీ స్థలాల్లో షాపులు కట్టుకుని, పంచాయతీకి పన్నులు కడుతుంటే ప్రతిసారీ జేసీబీలు తెచ్చి మా దుకాణాల ముందు తవ్వేయడం సరికాదని అడ్డు తగిలారు. రోడ్డుకి అవతల వైపు మురుగునీరు ఉంటే ఇటు వైపు ఎందుకు తవ్వాలని ప్రశ్నించారు. కళాశాల ప్రహరీని అనుకుని నిలిచిపోయిన మురుగు నీరు తీసే ప్రయత్నం చేయాలని పట్టుబడ్డారు. గతంలో తుఫాన్ వేళలో ఇదే తీరుగా అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా.. జిరాయితీ స్థలంలోకి మిషన్‌తో కాలువ తీసి వెళ్లిపోయారని మండిపడ్డారు. దీంతో ఈఓ అనురాధ వెళ్లి ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ లక్ష్మిలను వెంటపెట్టుకొచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేని అధికారులు దుకాణదారులకు కొద్ది రోజుల సమయం ఇచ్చారు. దుకాణాల ముందు ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న షెడ్‌లు స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించి వదిలేశారు.

చీకట్లో తొలి అడుగు..



బొండపల్లి: గ్రామ సభలో పాల్గొన్న హోమ్ మంత్రి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వ పాలన సంవత్సరం పూర్తవ్వడంతో టీడీపీ తొలి అడుగు కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తదితరులు గురువారం రాత్రి చీకటిలో నిర్వహించారు. మండలంలోని వి.కృష్ణాపురం, ఇంగిలాపల్లి గ్రామాల్లో నాయకులు పర్యటించగా.. పలు సమస్యలపై ప్రజలు నిలదీశారు. ముందుగా గొభ్యాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వంగపండు నారాయణప్పలనాయుడు సోదరుడు రామునాయుడు కొద్ది రోజుల కిందట మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హామీలు నెరవేర్చుతాం..

బొండపల్లి: ఎన్నికలలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతామని హోమ్ మినిస్టర్ అనిత అన్నారు. బొండపల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డీసీసీబి చైర్మన్ కిమిడి నాగార్జునతో కలసి పాల్గొన్నారు. పింఛన్లు రాలేదని, కార్డులు అందలేదని, రైతుభరోసా రాలేదని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకురాగా, అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి అనిత హామీ ఇచ్చారు.

సమస్యలను పరిష్కరించండి..



సర్పంచ్, కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామపెద్దలు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి పట్టణంలోని కొండపాలెం ప్రాంతంలో పలు సమస్యలు తిష్ట వేశాయని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కొండపాలెం మేజర్ పంచాయతీ ప్రజలు కోరారు. ఈ మేరకు సర్పంచ్ పి.ప్రమీల, పంచాయతీ కార్యదర్శి సకల నాగమణిని వార్డు సభ్యులు, పెద్దలు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎప్పటినుంచో తాగునీటి సమస్య ఉందని, కుళాయిల నుంచి సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని చెప్పారు. అలాగే రోడ్డుకిరువైపులా కాలువలు లేకపోవడంతో రోడ్డు మీద, పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోందన్నారు. శ్మశానవాటిక రహదారి అధ్వానంగా ఉందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు బాగు రమేష్, శ్రీను, కింతాడ కిరణ్‌కుమార్, విసినిగిరి ఈశ్వరరావు, నీలాద్రి సూర్యనారాయణ, పెంటయ్య దొర, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ ఎన్నికలు విజయవంతం చేయాలి



నోటీస్‌బోర్డులో ఎన్నికల షెడ్యూల్‌ను పొందుపరుస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, తదితరులు

చీపురుపల్లి: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలను విజయవంతం చేయాలని ఆ సంఘం చీపురుపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడు టి.ప్రవీణ్‌కుమార్ కోరారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్‌ను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్‌తో కలిసి ప్రచురించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జూలై 12న ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు చెప్పారు. నామినేషన్లు అధికంగా వస్తే ఉదయం 11 నుంచి 12.30 గంటల మధ్య ఎన్నిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్ ఎ.రమణమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో టైపిస్ట్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి జిందాల్ సమస్య..

- ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుధారాజు, తదితరులు

శృంగవరపుకోట: జిందాల్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఇందుకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ అపాయింట్‌మెంట్ల కోసం ప్రయత్నిస్తున్నామని ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు తెలిపారు. ఎస్.కోటలోని తన స్వగృహంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. జిందాల్ కంపెనీ వస్తే ఉపాధి దొరుకుతుందనే ఉద్దేశంతో 2007లో స్థానిక రైతులందరూ భూములు ఇచ్చారన్నారు. జిందాల్ ప్రతినిధులు నాడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిర్వాసితులు కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. నాడు ఎకరానికి 2,00,500 రూపాయలు చెల్లించారు. షేర్‌గా రూ.2,05,000 ఇస్తామన్నా నేటికీ కొందరికీ చెల్లించలేదన్నారు. జిందాల్ ప్రతినిధులు నిర్వాసిత రైతులకు నాటి ధరనే చెల్లిస్తామనడం సరి కాదన్నారు. కూటమి సర్కారు రైతులకు అన్యాయం చేయదని నమ్ముతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల తరఫున పోరాటం చేస్తున్న సన్యాసిరావు అనే వ్యక్తిపై ఇటీవల దాడి జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాడి జరిగి ఐదు రోజులవుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిందాల్ సమస్యను రాజకీయ కోణంలో చూడకుండా రైతు సమస్యగా చూడాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సోమేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి దేవి, ఒబ్బిన సతీష్, కారుకొండ వెంకటరావు, భోజంకి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



లింగంపేటలో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

లక్కవరపుకోట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేయాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ శిక్షకుడు కోటిబాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగంపేట, చందులూరు గ్రామాల్లో రైతులకు గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లు, పలువురు మహిళా రైతులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకంపై శిక్షణ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ, వేంకటేశ్వర పశువైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో గరివిడి పశువైద్య కళాశాలలో 20 మంది ఎస్సీ మహిళా రైతులకు శాస్త్రీయ పద్ధతిలో గొర్రెలు, మేకల పెంపకంపై మూడు రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ ఎం. దామోదర్ మాట్లాడుతూ.. శిక్షణతో ఆర్థికంగా బాగుపడవచ్చన్నారు. నట్టల నివారణా మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మక్కేన శ్రీను, కార్యక్రమ కో ఆర్డినేటర్లు డాక్టర్ శిరీష, డాక్టర్ జగదాంబ, పశుగణ క్షేత్ర సముదాయం విభాగాధిపతి డాక్టర్ అనిత, పశుయాజమాన్యం విభాగాధిపతి డాక్టర్ ఆనందరావు, డాక్టర్ సతీష్, డాక్టర్ దేవిక, డాక్టర్ స్వప్ననాథ్, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

భోగాపురం: కార్మిక రంగానికి నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి మండల కేంద్రంలో ఎంఈవోను గురువారం కలిసి సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన సమ్మె చేస్తున్నామని తెలిపారు. ప్రతి కార్మికుడు ఈ సమ్మెలో పాల్గొని, తమ నిరసన గళం విప్పాలన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్స్యూరెన్స్ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

పక్కాగా చెత్త సేకరణ ..



అలుగోలులో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణరాజు

నెల్లిమర్ల రూరల్: ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ పక్కాగా చేయాలని ఎంపీడీవో రామకృష్ణరాజు ఆదేశించారు. మండలంలోని అలుగోలు గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులు, చెత్తసేకరణ వంటి విషయాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోజూ కాలువల్లోని చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు అందులోని పూడికలు తొలగించి బయట పారవేయాలన్నారు. అలాగే సేకరించిన చెత్తను చెత్త సంపద కేంద్రాలకు తరలించి, ఎరువు తయారు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, నీటి నాణ్యతను పరీక్షించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శంకర జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



గజపతినగరం: మరుపల్లి గ్రామం నుంచి సచివాలయానికి, విద్యాలయాలకు వెళ్లే రోడ్డు దుస్థితి

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఆర్‌ఓబీ వద్ద ఉన్న తాత్కాలిక రోడ్డంతా గోతుల మయం కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఆర్‌ఓబీకి ఇరువైపులా కిలోమీటర్ మేర ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులేర్పడడంతో వాహనాలు పాడవుతున్నాయని యజమానులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బురదమయం..

గజపతినగరం: మండలంలోని బంగారమ్మపేట, మరపల్లి గ్రామాల్లో పలుచోట్ల రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. బంగారమ్మ పేట నుంచి ఇద్దనవలస గ్రామానికి వెళ్లే రహదారి.. మరుపల్లి నుంచి గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలకు వెళ్లే రహదారి పూర్తిగా బురదమయంగా మారాయి. ఈ రోడ్డు మీదుగా మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీ హైస్కూల్, కస్తూరిబా గాంధీ విద్యాలయాలకు నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి రహదారులను అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా..

కొత్తవలస: కూటమి నాయకులు చెబుతున్న మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. రహదారుల అభివృద్ధికి రూ. 890 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నా.. నేటికీ చాలా రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి. కొత్తవలస పట్టణం నుంచి విజయనగరం జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కొత్తవలస: విజయనగరం వెళ్లే ప్రధాన రోడ్డులో గిడిజాల జంక్షన్ వద్ద పరిస్థితి



పెదమానాపురంలో అధ్వానంగా ఉన్న రహదారి

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం ఫీడర్‌లో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా గరివిడి మండలంలోని కోనూరు సబ్‌స్టేషన్ పరిధిలో గల కోనూరు, శివరాం, పర్ల, దుమ్మెద, దేవాడ, నడిపేనపేట, అర్తమూరు గ్రామాలకు.. అదేవిధంగా గుర్ల మండలంలోని నాగళ్లవలస సబ్‌స్టేషన్ పరిధిలో ఉండే గరివిడి మండలంలోని తోండ్రంగి, దువ్వాం, శేరిపేట, డీఎఫ్ఎన్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.